సాక్షి
తిరుపతి
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



మత్తుతో జీవితాలు చిత్తు
మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. - 8లో



అల్లకల్లోలం
బంగాళాఖాతంలో వాయుగుండం కారణంగా తీర ప్రాంతం అప్రమత్తమైంది. మత్స్యకారులు వేట నిలిపివేశారు. - 8లో



సమాచారశాఖకు డిజిటల్ కెమెరా
జిల్లా సమాచారశాఖ కార్యాలయానికి శనివారం ఆధునిక డిజిటల్ కెమెరాను కలెక్టర్ వెంకటేశ్వర్ అందించారు. - 8లో

న్యూస్‌రీల్

మోడ్రన్‌గా పాకాల రైల్వేస్టేషన్



సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్‌ఎం విజయ్‌కుమార్

పాకాల : పాకాల రైల్వే స్టేషన్‌ను మోడ్రన్‌గా తీర్చిదిద్దుతామని గుంతకల్ రైల్వే డీఆర్‌ఎం ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక రైల్వేస్టేషన్‌ను ఆయన పరిశీలించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ స్టేషన్‌లో తాగునీటి సమస్య పరిష్కరిస్తామన్నారు. పాకాల మీదుగా కాట్పాడి–తిరుపతి డబుల్ ట్రాక్ పనులను త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం పలు రైళ్లను పాకాల మీదుగా వెళ్లే ఏర్పాటు చేస్తామన్నారు. స్థానికంగా తలెత్తిన రైల్వే గేటు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.

సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఈఓ శేఖర్

చంద్రగిరి(తిరుచానూరు) : సార్వత్రిక విద్యతో ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని డీఈఓ శేఖర్ తెలిపారు. శనివారం తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా ఓపెన్ స్కూల్స్ అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తలతో అడ్మిషన్ల ప్రక్రియపై సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ దరఖాస్తుతో పాటుగా జత చేయవలసిన ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. తల్లిదండ్రుల పేర్లు, పుట్టిన తేదీ, కులం, మీడియం, సబ్జెక్టుల ఎంపిక వంటి విషయాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. ముందుగా అభ్యర్థి అక్షరాస్యత పరిశీలించాలని చెప్పారు. ఓపెన్ స్కూల్ ఉపయోగాలపై ప్రజలకు అవగాహనన కల్పించాలని కోరారు.ఓపెన్ స్కూల్ కూడా రెగ్యులర్ విద్యతో సమానమని వివరించాలని కోరారు. గత ఏడాదికి మించి ఎక్కువ అడ్మిషన్లు చేసేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు . సమావేశంలో ప్రభుత్వ పరీక్షల సహాయ సంచాలకుడు, జిల్లా సమన్వయకర్త గురుస్వామి రెడ్డి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో విజ్ఞాన పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం సెట్విన్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ఆ కళాశాలలోని వివిధ బ్రాంచ్‌లకు చెందిన 100 మందికిపైగా విద్యార్థులు పాల్గొని, పవర్ పాయింట్ ప్రెజంటేషన్ ఇచ్చారు. ఇందులో కంప్యూటర్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు జె.స్ఫూర్తి, కేఎస్.వరీసా అంజుమ్ సాఫ్ట్‌వేర్ బెస్ట్ యాప్‌పై ఇచ్చిన హాస్పిటల్ డయాగ్నసిస్ అనే పవర్ పాయింట్ ప్రజంటేషన్, మెకానికల్ బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు జీసస్, శివకుమార్, దివాకర్ ఇచ్చిన బ్రైట్ ఫ్యూచర్ త్రూ వర్టికల్ విండ్ మిల్ అనే పవర్ పాయింట్ ప్రజంటేషన్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. వీరు రాష్ట్ర స్థాయి పోటీల్లో వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ జీఎం మోహన్‌కుమార్, ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రాజమోహన్‌రెడ్డి, పాలిటెక్నిక్ కళాశాల జనరల్ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి, చిత్తూరులో సీఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు వీఆర్‌లో ఉన్న కెవి.సురేంద్రనాయుడును తిరుపతి జిల్లా పుత్తూరు అర్బన్ స్టేషన్‌కు, రాయచోటి వీఆర్‌లో ఉన్న ఎస్.రవీంద్రనాథ్‌ను తిరుపతి సీసీఎస్‌కు బదిలీ చేశారు. అలాగే తిరుపతి సైబర్ సెల్‌లో ఉన్న జి.అమర్‌నాథ్‌రెడ్డిని చిత్తూరు వీఆర్‌కు, నంద్యాల సీసీఎస్‌లో ఉన్న కె.శ్రీనివాసులును తిరుపతి ట్రాఫిక్‌కు, తిరుపతి వీఆర్‌లో ఉన్న జె.జయానాయక్‌ను రాయదుర్గానికి, తిరుపతి వీఆర్‌లో ఉన్న తమీమ్ అహ్మద్‌ను తిరుపతి మహిళా స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు.

రాగులు.. ఆరోగ్య సిరులు

నేటి సమాజంలో ఆరోగ్య రక్షణకే తొలి ప్రాధాన్యమిస్తున్నారు. శరీర బరువును అదుపులో ఉంచుకుని దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇప్పటికే సంక్రమించిన రోగాలను కట్టడి చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అందులో భాగంగా ఆహారపు అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. కంటికి నచ్చిన పదార్థాలను ఆరగించేయకుండా స్వీయ నియంత్రణ పాటిస్తున్నారు. జిహ్వ చాపల్యం తగ్గించుకుంటూ జీవనశైలిని మార్చుకుంటున్నారు. ఈ మేరకు గతంలో చిన్నచూపు చూసిన చిరుధాన్యాలకే ప్రస్తుతం పెద్దపీట వేస్తున్నారు. ముఖ్యంగా రాగులతో చేసిన వంటకాలను భుజించేందుకు అధికులు ఆసక్తిచూపుతున్నారు. పాత తరం పద్ధతులను అనుసరిస్తూ రోగనిరోధకశక్తిని పెంపొందించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



- రాగి పదార్థాలను భుజించేందుకు మొగ్గుతున్న ప్రజలు
- ఫంక్షన్లలో ప్రత్యేకంగా ఆరగిస్తున్న అతిథులు
- మార్కెట్‌లో విరివిగా లభ్యమవుతున్న పిండి వంటలు
- రోగాల నియంత్రణకు మేలంటున్న వైద్యులు
- ఆహారంలో భాగంగా మారిపోయిన రాగి సంగటి

తిరుపతి సిటీ : ఒకప్పుడు నిరుపేదల ఆకలిని తీర్చిన రాగిముద్దకు మళ్లీ మహర్దశ పట్టింది. ఆధునిక సమాజం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్న ఆలోచనతో రాగిపిండి వంటకాల వైపు చూస్తోంది. మూడుపూటలా చిరుధాన్యాలను తినేందుకు మొగ్గు చూపుతోంది. పాశ్చాత్య జీవన శైలి మనిషి ఆహారపు అలవాట్లపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు మార్కెట్‌లో నోటికి రుచిగా ఉండే పదార్థాలను ఇష్టానుసారంగా తినేసి కడుపును చెత్తకుప్పలా మార్చే దుస్థితి కల్పించింది. దీని ఫలితంగా ఎక్కువమంది అధిక బరువు, స్థూలకాయం, క్యాన్సర్, బీపీ, షుగర్, కొలస్ట్రాల్ వంటి వ్యాధులు భారిన పడుతున్నారు. ఈ క్రమంలో రోగాల నుంచి విముక్తి పొందేందుకు పాతతరం ఆహారపు అలవాట్లపై ప్రజలు దృష్టి సారిస్తున్నారు. శాస్త్ర పరిశోధనా రంగాలు, వైద్యులు సైతం చిరుధాన్యాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో అన్నిటికంటే ప్రధానంగా రాగిముద్దకు ప్రాధాన్యత పెరిగింది.



రాగి దోసెలు



రాగి పొంగడాలు

అందుబాటులో అనేక పదార్థాలు





ప్రస్తుతం చిన్న దుకాణం నుంచి పెద్ద సూపర్ మార్కెట్లలో పలు రకాల రాగి పదార్థాలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రధానంగా రాగి పిండితో చేసిన లడ్డూలు, రొట్టెలు, మరమరాలు, స్వీట్లు, బిస్కెట్లు దర్శనమిస్తున్నాయి. దీంతో పాటు పార్కులు, జనసంచార ప్రదేశాలలోనూ, ప్రధాన కూడళ్లలో రాగి మాల్ట్ స్టాళ్లు కనిపిస్తున్నాయి. అందులో రాగి జావ, అంబలివిక్రయిస్తున్నారు. అలాగే రాగి పిండి, చిరుధాన్యాలతో తయారు చేసిన రాగి మాల్ట్ ఇబ్బడిముబ్బడిగా దొరుకుతోంది. ప్రధాన మిల్లెట్ హోటళ్లలో రాగి పిండితో చేసిన ఇడ్లీ, దోసె, పాయసం, పొంగల్, ఉప్మా, పెసరట్టు వంటివి యువతను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఫైవ్‌స్టార్ హోటళ్లలో సైతం రాగి టీ, స్మూతీ, బాల్, బర్ఫీ, చపాతీ, వడ, హల్వా అంటూ పలు రకాల వంటకాలను లభ్యమవుతున్నాయి.

ప్రయోజనాలు ఎన్నో..!



- రాగిలో కనిపించే ప్రధాన ప్రొటీన్ ఎలుసినియన్. ఇది పోషకాహారలోపాలను నివారిస్తుంది
- శరీరానికి ఆక్సిజన్ సరఫరాకు ఉపయోగపడుతుంది
- షుగర్ కంట్రోల్ చేస్తుంది
- పిల్లల శారీరక వృద్ధికి సాయం చేస్తుంది
- మెగ్నీషియం, పాస్పరస్ అధికంగా ఉండటంతో శరీరానికి మంచిది
- గుండె కండరాలు, పనితీరు మెరుగుపరుస్తుంది
- రక్తహీనత, ఎముకలు, దంతాల పటిష్టతలో ప్రధాన భూమిక పోషిస్తుంది
- ఆరోగ్యకరమైన చర్మం, వెంట్రుకలకు సహకరిస్తుంది
- మలబద్ధకం నివారించి, మెరుగైన జీర్ణక్రియకు తోడ్పడుతుంది
- మానసిక ఆందోళ, డిప్రెషన్, నిద్ర లేమిని అరికడుతుంది

నయా ట్రెండ్ రాగి బాల్

వివాహాది శుభకార్యాలలో మధ్యతరగతి కుటుంబాల నుంచి బడా బాబుల వరకు ప్రతి కార్యక్రమంలోనూ సాధారణ భోజనాలతో పాటు ప్రత్యేకంగా రాగిముద్దకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఫంక్షన్‌కు హాజరైన స్నేహితులు, బంధువులు సైతం రాగిముద్ద వైపే మొగ్గు చూపడం గమనార్హం. నాన్ వెజ్ ప్రియులకు ప్రత్యేక కౌంటర్ ద్వారా రాగి ముద్ద, చికెన్, పాయా, తలకూర వంటివి సర్వ్ చేస్తున్నారు. నగరంలోని ప్రధాన కేటరింగ్ సర్వీస్ సెంటర్లు సైతం రాగి బాల్ విత్ చికెన్ ఐటమ్‌ను తమ మెనూలో చేర్చుతుండడం విశేషం.

అతిగా తీసుకుంటే మాత్రం..



- రాగులను ఆహారంలో అధికంగా తీసుకుంటే దుష్ప్రభావాలు తలెత్తుతాయి
- కడుపు ఉబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్య, డయేరియా వచ్చే అవకాముంటుంది
- మూత్రపిండాలలో రాళ్లు, మూత్ర విసర్జన సమస్యలు ఉన్నవారు దూరంగా ఉండాలి
- బరువు పెరగాలనుకునేవారు తక్కువ మోతాదులో తీసుకోవాలి
- అలర్జీ వ్యాధిగ్రస్తులు దూరంగా ఉండడం మంచిది

ముద్ద.. ముక్క ఉండాల్సిందే..!

నగర, పట్టణవాసులు రైస్‌కు సంబంధించిన వంటకాలు తినడం చాలా వరకు తగ్గించేశారు. ఆ స్థానంలో రాగి ముద్దకు ప్రాధాన్యతనిస్తున్నారు. ముఖ్యంగా కోవిడ్ సమయం నుంచి రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాల వంటకాలపైనే మక్కువ చూపుతున్నారు. ఆదివారం వచ్చిందంటే చాలు నాన్ వెజ్ ప్రియులు నాటు కోడి మాంసానికి తోడు రాగిముద్దలను లాగించేస్తుంటారు. కేర్ ఫర్ హెల్త్ అనే ప్రైవేటు సంస్థ దక్షిణ భారతంతోని సుమారు 4రాష్ట్రాలలో చేసిన సర్వే ప్రకారం సామాన్యుడి నుంచి ఉన్నత స్థాయి వర్గాల వరకు ప్రతి 100 మందిలో 78మంది రాగి పదార్థాలు నిత్యం ఏదో ఒక రూపంలో తీసుకుంటున్నట్లు పేర్కొంది.

ఆరోగ్య ప్రసాదంగా పరిశోధనలలో వెల్లడి





జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు పొందినసంస్థలు సైతం రాగుల వాడకంపై పలు మార్లు పరిశోధనలు చేశాయి. ఆరోగ్య ప్రసాదరంగా పేర్కొన్నాయి. రోగనిరోధక శక్తిని పెంచే పదార్థాలలో ఒకటిగా రాగులను గుర్తించాయి. దీంతో ప్రపంచవ్యాప్తంగా రాగిపంట సాగు 2021 నుంచి 28 శాతం పెరిగినట్లు వ్యవసాయ పరిశోధనా సంస్థలు తమ వార్షిక గణాంకాలలో వివరించాయి.

శరీరానికి మంచిది



రాగులు మానవ ఆరోగ్య సంరక్షణలో ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. శరీరానికి కావలసిన కాల్షియం లభిస్తుంది. రాగులలో పోషకాహార ప్రొఫైల్ ఉండడంతో పాటు విటమిన్లు, మినరల్స్, కార్బొహైడ్రేట్‌లు, ప్రధానంగా కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. దీంతో పాటు కార్బొహైడ్రేట్స్ తక్కువగా ఉండడంతో షుగర్ వ్యాధి నియంత్రణకు ఉపయోగపడుతుంది. రాగులలో పీచు పదార్థం ఉండటంతో జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.
– డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రొఫెసర్, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల, తిరుపతి

వ్యాధులకు చెక్ పెట్టవచ్చు



రాగి పదార్థాలు పలు రకాలుగా తయారు చేసి చిన్న పిల్లలకు పెట్టడం వల్ల హైట్ పెరగడంతో పాటు కాల్షియం , ఫైబర్ పుష్కలంగా లభిస్తాయి. పెద్దలకు సైతం ఆధునిక కాలంలో వచ్చే అనేక వ్యాధుల బారిన పడకుండా చెక్ పెట్టవచ్చు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రాగులు వంటి చిరుధాన్య పంటలకు ప్రసిద్ధి. రక్తహీనత, మానసిక రుగ్మతలకు రాగి ముద్ద, జావ వంటి పదార్థాలతో నియంత్రించవచ్చు. డయాబెటీస్ వ్యాధిగ్రస్తులకు చాలా మంచింది.
– కేవీ సుచరిత, ప్రొఫెసర్, ఫుడ్ అండ్ న్యూట్రీషియన్ విభాగం, తిరుపతి

రాగి వంటకాలే తింటున్నాం



నాకు 82 ఏళ్లు. మా చిన్నతనంలో ప్రతి రోజూ రాగి ముద్ద తప్ప రైస్‌తో భోజనం చేయడం అరుదు. రాగులలో ఉండే శక్తి ఏ ఆహార పదార్థాలలోనూ లేదనే విషయం సుస్పష్టం. అందుకే ఇప్పటికీ నాకు షుగర్, స్థూలకాయం, హైబీపీ వంటి సమస్యలు రాలేదు. చక్కగా ఆరోగ్యంగా ఉన్నా. మా ఇంట్లో పిల్లల నుంచి పెద్దల వరకు నిత్యం రాగి ముద్ద తినాల్సిందే. రెండు నెలలకోసారి, పండగలకు, ఫంక్షన్లకు వెళ్లినప్పుడు మాత్రమే రైస్ తీసుకుంటాం.
– వి.రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ టీచర్, తిరుపతి

భయం.. భయం!

కూలీ పనులు చేసి చెమటోడ్చి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించేందుకు ఇంజినీరింగ్ కళాశాలలకు పంపుతున్నారు. ఆ కళాశాలల్లో చదువుతున్న బాలికలకు భద్రత చాలా ముఖ్యం. ఇంట్లో కంటే ఎక్కువ సమయం విద్యార్థులు కళాశాలల్లోనే గడుపుతారు. అలాంటి విద్యార్థులను ఎంతో జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత యాజమాన్యాలపై ఉంటుంది. రాష్ట్రంలోని కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థినుల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల ఘటన చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఉలికిపాటుకు గురిచేసింది. ఈ ఘటన తర్వాత ఇంజినీరింగ్ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతపై ఆందోళన చెందుతున్నారు.



- గుడ్లవల్లేరు కళాశాలలో హిడెన్ కెమెరాలపై ఉలికిపాటు
- ఇంజినీరింగ్ కళాశాలల్లో భద్రత సర్వత్రా చర్చనీయాంశం
- భయాందోళనలో పిల్లలు, తల్లిదండ్రులు
- పకడ్బందీ చర్యలు చేపట్టాలంటున్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎక్కువగా ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలే ఉన్నాయి. ఎన్నో ఆశలు, ఆశయాలతో ఇంజినీరింగ్ వైపు విద్యార్థులు మక్కువ చూపుతున్నారు. పలు చోట్ల నేటికీ ర్యాగింగ్ అనే సమస్య ఉన్నప్పటికీ అధిగమించి ఇంజినీరింగ్ పూర్తి చేస్తున్నారు.

భద్రతపై దృష్టి పెట్టాలి

ఇంజినీరింగ్ కళాశాలల్లో భద్రత పట్ల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. కృష్ణా జిల్లా ఘటనలు కలవరింపునకు గురిచేస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. కళాశాలల్లో విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేకంగా ఫిర్యాదు సెల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సీక్రెట్ కెమెరాల లాంటి ఘటనలు చోటు చేసుకుంటే విద్యార్థినుల భవిష్యత్ ఏం అవుతుందోనన్న భయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాలల్లోని ప్రైవసీ ప్రదేశాల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు పనిచేయకుండా జామర్లను పెట్టించాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్వత్రా చర్చనీయం

కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల వాష్‌రూమ్‌ల్లో సీక్రెట్ కెమెరాల ఘటన వెలుగులోకి రావడంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన చోటుచేసుకున్న వెంటనే విద్యార్థినుల తల్లిదండ్రులు భయాందోళనకు లోనయ్యారు. చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి తిరుపతి జిల్లాలో చదువుతున్న విద్యార్థినుల కళాశాలలకు తల్లిదండ్రులు పరుగులు తీశారు. తమ పిల్లల యోగక్షేమాలను తెలుసుకుని కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడే ప్రయత్నాలు చేశారు. ఇప్పటి వరకు గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని విద్యావేత్తలు చెబుతున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల సమాచారం

ఇంజినీరింగ్ కళాశాలలు 14	ఇంజినీరింగ్ విద్యార్థులు 9,657
యూనివర్సిటీలు 03	యూనివర్సిటీ విద్యార్థులు 22,589
ఎంబీఏ కళాశాలలు 09	ఎంబీఏ విద్యార్థులు 2,589
ఎంసీఏ కళాశాలలు 02	ఎంసీఏ విద్యార్థులు 1,958
2 మెడికల్ కళాశాలల్లో విద్యార్థులు 1,589	

ప్రభుత్వం బాధ్యత వహించాలి



కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. ప్రత్యేక చొరవ చూపి నిందితులను కఠినంగా శిక్షించాలి. ఘటనపై నిష్పాక్షికంగా దర్యాప్తు చేయాలి. లేకుంటే విద్యార్థినులు ఉన్నత చదువుకు దూరమయ్యే అవకాశం ఉంది. – నేహిత్ కుమార్, ఇంజినీరింగ్ విద్యార్థి

భద్రత ముఖ్యం



కళాశాలల్లో భద్రత చాలా ముఖ్యం. నాలుగేళ్ల పాటు ఇంజినీరింగ్ చదువుతాం. ఎక్కువగా కళాశాలల్లోనే గడుపుతాం. అక్కడ భద్రత కరువైతే ఏం చేయాలి. యాజమాన్యాలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు చూస్తే తల్లిదండ్రులు అమ్మాయిలను కళాశాలలకు ఎలా పంపుతారు.
– లలిత, ఇంజినీరింగ్, విద్యార్థిని

బెదిరించడం అన్యాయం



కృష్ణా జిల్లా ఘటనలో ఎంతటి పెద్ద వారు ఉన్నా శిక్షించాలి. అనుమానం వచ్చి విద్యార్థులు యాజమాన్యానికి ఫిర్యాదు చేస్తే సమగ్రంగా విచారణ చేయాల్సింది పోయి బెదిరింపులకు దిగడం అన్యాయం. అమ్మాయిలకు భద్రత కల్పించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలి.
– మోహన్, ఇంజినీరింగ్ విద్యార్థి

నిరంతరం పర్యవేక్షణ తప్పనిసరి



కళాశాలల్లో విద్యార్థినుల భద్రతకు పర్యవేక్షణ తప్పనిసరి. అయితే చాలా కళాశాలల్లో అలా జరగడం లేదు. అందువల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మరుగుదొడ్లలో హిడెన్ కెమెరాలు పెట్టడం దారుణం . ప్రభుత్వం సమగ్ర విచారణ చేసి విద్యార్థులకు న్యాయం చేయాల్సిన అవసరం ఉంది.
– సాయి, ఇంజినీరింగ్ విద్యార్థి

క్లుప్తంగా

టీటీడీ విజిలెన్స్ సిబ్బంది నిజాయితీ



పోగొట్టుకున్న బ్రాస్‌లెట్‌ను భక్తులకు అప్పగిస్తున్న అధికారులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన భక్తులు పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లైట్‌ను టీటీడీ విజిలెన్స్ సిబ్బంది తిరిగి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన శ్రీలత కుటుంబ సభ్యులతో కలిసి శనివారం శ్రీనివాసమంగాపురం వచ్చారు. స్వామిని దర్శించుకుని బయటకు వచ్చారు. ఆలయ ఆవరణలో సుమారు 16 గ్రాముల బంగారు బ్రాస్‌లైట్‌ను పోగొట్టుకున్నారు. అది మరో భక్తుడికి దొరకడంతో టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేశారు. అధికారులు మైకులో ప్రచారం చేయడంతో శ్రీలత అధికారులను కలిసి తగిన గుర్తులు తెలిపారు. అనంతరం ఆలయ ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదార్ జలంధర్ సమక్షంలో భక్తులకు దాన్ని అప్పగించారు. సుమారు రూ.లక్ష విలువైన బ్రాస్‌లైట్‌ను తిరిగి అప్పగించిన సిబ్బందికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

తుడా అభివృద్ధికి కృషి



బాధ్యతలు తీసుకుంటున్న మౌర్య

తిరుపతి తుడా: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) అభివృద్ధికి కృషి చేస్తానని వైస్ చైర్మన్ మౌర్య తెలిపారు. ఆమె శనివారం తుడా వైస్ చైర్మన్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా జులై 24న బాధ్యతలు చేపట్టానని, 2019 వరకు నగరపాలక సంస్థ కమిషనర్ తుడాకు కూడా పూర్తి బాధ్యతలు నిర్వహించే వారని తెలిపారు. ఆ తరువాత ప్రభుత్వం నిర్ణయం తీసుకుని తనకు తుడా వైస్ చైర్మన్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. తుడా వైస్‌చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మౌర్యను ఇన్‌చార్జ్ వీసీగా పనిచేసిన వెంకట నారాయణ, నగరపాలక సంస్థ, తుడా అధికారులు అభినందనలు తెలిపారు.

ఎనర్జీ సోర్సెస్‌పై అంతర్జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శనివారం రెన్యూవబుల్ ఎనర్జీ సోర్సెస్ అండ్ అప్లికేషన్స్‌పై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రధానంగా అవోల్యూషన్ ఆఫ్ బ్యాటరీస్, సోలార్ థిన్‌ఫిలిమ్స్ అనే అంశాలపై చర్చించారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

- యువత మన దేశ సంపద
- డ్రగ్స్ మహమ్మారితో తస్మాత్ జాగ్రత్త
- మాదకద్రవ్య రహిత నగరంగా తిరుపతి
- ఎస్పీ సుబ్బరాయుడు పిలుపు



ర్యాలీలో పోలీసులు, వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ: మత్తుకు బానిసైతే జీవితం నాశనం అవుతుందని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎస్వీయూ ఎన్ఎస్ఎస్, పోలీసు శాఖ సంయుక్తంగా శనివారం డ్రగ్స్ ఫ్రీ ఇండియా అనే అంశంపై వర్సిటీ పరిపాలనా భవనం నుంచి బాలాజీ కాలనీ, టౌన్‌క్లబ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వీసీ డాక్టర్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించిందన్నారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత దేశ సంపదని, అది గుర్తెరిగి మసలుకోవాలనిసూచించారు. వీసీ మాట్లాడుతూ యువత మత్తుకు బానిసైతే జీవితాలతో పాటు కుటుంబం రోడ్డున పడుతుందని వివరించారు. యువత లక్ష్యాల సాధనకు కృషి చేసి వర్సిటీకి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో డీన్ ఆచార్య చంద్రాయుడు, ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ, నగరంలోని పలు కళాశాలలకు చెందిన సుమారు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- హెచ్చరించిన కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: మహిళలకు గర్భస్థ పరీక్షలు నిర్వహించేది పిల్లల ఎదుగుదలను గుర్తించి, అవసరమైన చికిత్స చేయడానికి మాత్రమేనని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పరీక్షల పేరుతో లింగ నిర్ధారణ చేసి, తల్లిదండ్రులకు తెలియజేయడం పెద్ద నేరంగా పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ చేస్తే వారికి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లపై వైద్యాధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. స్కానింగ్ సెంటర్లను పర్యవేక్షించని వైద్యాధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (నిబంధన, దుర్వినియోగం నివారణ) నియమాలు 1994, 1996 మేరకు చట్టం పక్కాగా అమలు కావాలని ఆదేశించారు. కమిటీ కన్వీనర్ హోదాలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి వివరిస్తూ డెకాయ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్జీఓ అధికారి మీరా మాట్లాడుతూ ఆడ పిల్లలపై చిన్నచూపు ఉండకూడదన్నారు. లింగ నిర్ధారణ విషయంలో ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, పోలీస్ మెడికల్ ఆఫీసర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ప్రోత్సాహం

తిరుపతి అర్బన్ : గిట్టుబాటు ధర సాధించే దిశగా రైతు ఉత్పత్తి సంఘాలను ప్రోత్సహించాలని నాబార్డ్ డీఎం సునీల్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో నాబార్డ్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, అనుబంధశాఖల అధికారులు హాజరయ్యారు. డీఎం మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ఉత్పత్తి సంఘాలకు అందిస్తున్న రాయితీలను వివరించి వారికి లబ్ధి చేకూర్చేందుకు అధికారులు సహకరించాలని కోరారు. అలాగే రైతులకు బ్యాంక్ రుణాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథరెడ్డికి సూచించారు.

టిప్పర్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

రాపూరు: మండలంలోని తానంచర్ల సమీపంలో శనివారం రాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు కథనం మేరకు.. శానాయిపాళెం గ్రామానికి చెందిన మల్లి బలరామ్ (23) ఆటోలో రాపూరు నుంచి పొదలకూరు వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

బాధ్యతగా పనుల పర్యవేక్షణ



పి. భారతి, ఏఓ, కలెక్టరేట్

తిరుపతి అర్బన్ : కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనులు పర్యవేక్షిస్తానని ఏఓ పి.భారతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ అన్ని సెక్షన్లలోని ఉద్యోగులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు సేవలిందిస్తానని వెల్లడించారు.

నేటి నుంచి శుక్ల యజుర్వేద పారాయణం

తిరుమల : లోక కళ్యాణార్థం టీటీడీ నిర్వహిస్తున్న చతుర్వేద పారాయణంలో భాగంగా ఆదివారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో 4వ విడత శుక్ల యజుర్వేద పారాయణం ప్రారంభం కానుంది.

శ్రీవారి భక్తురాలికి స్విమ్స్‌లో చికిత్స

తిరుపతి తుడా : తిరుమలలో శనివారం చెట్టుకొమ్మ విరిగి పడడంతో శ్రీవారి దర్శనార్థం వచ్చిన చెన్నైకి చెందిన ఉమామహేశ్వరి(44) గాయపడింది. ఆమెకు తిరుపతి స్విమ్స్‌లో చికిత్స అందిస్తున్నారు.

అందని ద్రాక్షగా 'ఇంటికే పింఛన్'

నాగలాపురం : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కడుపులో చల్ల కదలకుండా లబ్ధిదారులకు పింఛన్ అందేంది. వలంటీర్లు ఇంటికి వచ్చి సొమ్ము చేతిలో పెట్టేవారు. అయితే ప్రస్తుతం ఇంటికే పింఛన్ అందని ద్రాక్షగా మారిపోయిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. సచివాలయ సిబ్బంది పెన్షనర్లను ఏదో ఒకచోటకు రమ్మని అక్కడే అందరికీ నగదు పంపిణీ చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కదలలేని స్థితిలో ఉన్న వారిని కూడా కనికరం లేకుండా రప్పిస్తున్నారని మండిపడుతున్నారు. శనివారం ఈ మేరకు నాగలాపురం తూర్పుదళితవాడలో అవ్వాతాతలను ఓ ఆలయం వద్దకు రావాలని హుకుం జారీ చేసినట్లు వెల్లడిస్తున్నారు. ఇక చేసేదిలేక అందరం అక్కడి వెళ్లిన తర్వాత పింఛన్ పంపిణీ చేసినట్లు వివరిస్తున్నారు. దీనిపై సచివాలయ సిబ్బందిని ప్రశ్నిస్తే.. ఇంటింటికీ వెళ్లడం తమతో కుదరదని తేల్చిచెప్పడం గమనార్హం.

చెట్టును ఢీకొన్న బస్సు

కలువాయి : మండలంలోని వెరుబొట్లపల్లె క్రాస్ వద్ద శనివారం రోడ్డు దాటుతున్న ఓ వ్యక్తిని తప్పించబోయి ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న మర్రిచెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

అనధికార తట్టలో అగ్నిప్రమాదం

తిరుమల : తిరుమలలో అనధికారికంగా ఏర్పాటు చేసిన తట్టలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. వివరాలు.. సీఆర్‌ఓకు ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ సందులో గుర్తు తెలియని వ్యక్తి అనధికార తట్ట నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆ తట్టలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ఫైర్ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అల్లకల్లోలం



తూపిలిపాళెం వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న కెరటాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసే ప్రమాదముందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఆదివారం వేకువజామున ఉత్తరాంధ్ర వద్ద తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. సముద్రంలో కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతుండడంతో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ క్రమంలో చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని తీర ప్రాంతంలో మత్స్యకారులు తమ బోట్లను ముందస్తుగా భద్రపరుచుకున్నారు. ఓ వైపు వేట ఆగిపోవడం.. మరోవైపు ప్రభుత్వం నుంచి 'భృతి' విడుదల కాకపోవడంతో కుటుంబ పోషణకు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. – వాకాడు

నేడు యూపీఎస్సీ పరీక్షలు



పరీక్షల ఏర్పాట్లపై మాట్లాడుతున్న డీఆర్వో పెంచలకిషోర్

తిరుపతి అర్బన్: యూపీఎస్సీ పరీక్షలకు అన్ని వసతులు కల్పించాలని డీఆర్వో పెంచల కిషోర్ ఆదేశించారు. ఆయన శనివారం పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం తిరుపతి నగరంలోని మూడు కేంద్రాల్లో యూపీఎస్సీ ఆధ్వర్యంలో నేషనల్ డిఫెన్స్ అకాడెమీ, నావల్ అకాడెమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గణితం పేపర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సెషన్ ఎబిలిటీ పేపర్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. అలాగే కంబైండ్ డిఫెన్స్ సర్వీసెస్‌కు చెందిన ఇంగ్లీష్ పేపర్ ఉదయం 9 నుంచి 11 వరకు, జనరల్ నాలెడ్జ్ పేపర్ 12 నుంచి 2 గంటల వరకు, ఎలిమెంటరీ గణితం పేపర్ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలకు 821 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని వెల్లడించారు. శ్రీపద్మావతి బాలికల హైస్కూల్‌లో ఒక సెంటర్, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాలలోని రెండు సెంటర్లలో పరీక్షలు ఉంటాయని వివరించారు. యూపీఎస్సీ సెక్షన్ ఆఫీసర్ శశిభూషణ్, తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి, సెట్విన్ సీఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

పొలంబడి పద్ధతిలో వ్యవసాయం



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు

తిరుపతి అర్బన్: పొలంబడి పద్ధతుల్లో రైతులు సేద్యం చేసేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులకు పొలంబడి పద్ధతిలో వ్యవసాయం చేయించేలా అన్నదాతలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా గుంటూరు డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయం నుంచి విచ్చేసిన వ్యవసాయ శాఖ అధికారులు వెంకటేశ్వర్లు, కిరణ్మయి, వెంకట్రావు సాగు, పాటించాల్సిన పలు అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు. ప్రధానంగా పొలంబడి వ్యవసాయంలో రెండు మీటర్ల వరి పంటసాగు చేస్తే.. మధ్యలో ఒక్క అడుగు గ్యాప్ ఇచ్చే పద్ధతులను వివరించారు. అలా చేయడం ద్వారా తెగుళ్ల తాకిడి తగ్గుతుందని, వరి పంట గంటకట్టి మంచి దిగుబడి వస్తుందని చెప్పారు. అంతేకాకుండా దిగుబడి బాగుంటుందని వివరించారు. మరోవైపు రసాయనిక ఎరువుల వాడాకాన్ని తగ్గించాలని తెలిపారు. దీంతో తెగుళ్ల తగ్గుతాయని తెలిపారు. సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలని పేర్కొన్నారు. అలా చేస్తే పంట ఏపుగా పెరుగుతుందని, దిగుబడి అధికంగా ఉంటుందని తెలిపారు. పంట మార్పిడి చేయడం సరైన పద్ధతిగా పేర్కొన్నారు. ఒకే పంటను సాగు చేయడం ద్వారా తెగుళ్ల ఎక్కువగా సోకుతాయని, దిగుబడి తగ్గిపోతుందని పేర్కొన్నారు. భూసార పరీక్షలతో కలిగి ప్రయోజనాలను వివరించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉండే రకం పంటను సాగు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేడ్ ఏడీ ధనుంజయరెడ్డితోపాటు తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సమాచారశాఖకు డిజిటల్ కెమెరా

తిరుపతి అర్బన్ : జిల్లా సమాచారశాఖ కార్యాలయానికి లేటెస్ట్ డిజిటల్ ఫొటో కెమెరా అందించారు. శనివారం ఈ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా జెడ్ 7– ఐఐ నికాన్ కంపెనీకి చెందిన కెమెరాను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్యకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ కెమెరా చాలా బాగుంది, నాణ్యమైన ఫొటోలను మీడియాకు సకాలంలో ఇవ్వాలని ఆదేశించారు. ఆలస్యంగా ఇస్తే మీడియా కవరేజ్ తగ్గుతుందని తెలిపారు.